సాక్షి
వైఎస్సార్ జిల్లా

శుక్రవారం | 24 | జనవరి | 2025



ఉత్సాహంగా సాగిన స్పోర్ట్స్ మీట్
కడప నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో గురువారం స్థానిక మున్సిపల్ స్టేడియంలో నిర్వహించిన స్పోర్ట్స్ మీట్ ఉత్సాహంగా సాగింది.
-IIలో



సత్ప్రవర్తనతో విద్యను అభ్యసించాలి
పిల్లలు సత్ప్రవర్తనతో విద్యను అభ్యసించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. బాబా ఫకృద్దీన్ తెలిపారు.
-IIలో

గరిష్టం/కనిష్టం
30.4/17.9

వాతావరణం
జిల్లాలో బుధవారం 17.9 – 30.4 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

రేపు డయల్ యువర్ ఆర్ఎం

కడప కోటిరెడ్డిసర్కిల్: ఏపీఎస్ ఆర్టీసీ ప్రయాణికుల సమస్యలే పరిష్కారంగా నిర్వహిస్తున్న డయల్ యువర్ ఆర్ఎం కార్యక్రమాన్ని ఈనెల 25న నిర్వహించనున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. శనివారం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆ సమయంలో ప్రయాణికులు 99592 25848 నెంబరుకు ఫోన్ ద్వారా లేదా వాట్సాప్‌లో తమ సమస్యలు తెలియజేయవచ్చన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

25న నిరసన

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయమని డిమాండ్ చేస్తూ ఈ నెల 25న కలెక్టరేట్ ఎదుట 'థాలి బజావో' పేరిట ప్లేటు, స్పూన్లు చేతబట్టి పెద్ద శబ్దంతో నిద్రలో ఉన్న ప్రభుత్వాన్ని నిద్రలేపేలా ''సూపర్ సిక్స్ – సూపర్ ఫ్లాప్'' నినాదంతో నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు డీసీసీ అధ్యక్షుడు విజయ జ్యోతి, కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు అఫ్జల్‌ఖాన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నిరసన కార్యక్రమానికి జిల్లాలోని రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, అనుబంధ విభాగాలైన ఎన్.ఎస్.యు.ఐ, యూత్ కాంగ్రెస్, సేవాదళ్, మహిళా కాంగ్రెస్ విభాగాల నాయకులు, అసెంబ్లీ కో–ఆర్డినేటర్లు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు బాధ్యతలను స్వీకరించనున్న నూతన ఎస్పీ




ఈ.జి. అశోక్ కుమార్

కడప అర్బన్: వైఎస్‌ఆర్ జిల్లా నూతన ఎస్పీగా నియమితులైన ఈ.జి అశోక్‌కుమార్ ఈనెల 24న జిల్లాకు విచ్చేసి ఎస్పీగా బాధ్యతలను చేపట్టనున్నారు. జిల్లా పోలీసుకార్యాలయంలో శుక్రవారం మధ్యాహ్నం 1 గంటకు బాధ్యతలను స్వీకరించిన తరువాత మీడియాతో మాట్లాడతారు.

- అనంతపురం జిల్లా నార్పలకు చెందిన ఈ.జి అశోక్‌కుమార్ విద్యాభ్యాసం ముగియగానే ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగారు. 2010లో డీఎస్పీగా శిక్షణ పూర్తి చేసుకుని నాగర్ కర్నూలులో 2011–12, చింతపల్లిలో 2013–2014, కడప డీఎస్పీగా 2014 నుంచి 2017 వరకు విధులు నిర్వహించారు. 2017 నుంచి 2018 వరకు ఇంటిలిజెన్స్‌లో పనిచేశారు. 2018లో అదనపు ఎస్పీగా పదోన్నతి పొందారు. ఇటీవల అదనపు ఎస్పీ నుంచి ఎస్పీలుగా పదోన్నతి పొందారు. పదేళ్ల తరువాత మళ్లీ ఎస్పీ హోదాలో జిల్లాకు విచ్చేసి పదవీ బాధ్యతలను చేపట్టనున్నారు.

మద్దతు ధరతో కంది కొనుగోలు



కడప సెవెన్‌రోడ్స్: ఈ–క్రాప్ చేయించుకున్న రైతుల నుంచి ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా జిల్లాలో కంది కొనుగోలు ప్రక్రియ త్వరలో ప్రారంభించనున్నట్లు జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన క్వింటాలు రూ.7,550తో కందులు కొనుగోలు చేయనున్నట్లు వెల్లడించారు. రైతు సేవా కేంద్రాల్లో ఇంకా పేర్లు నమోదు చేయించుకోని రైతులు వెంటనే నమోదు చేయించుకోవాలని కోరారు. తేమ 12 శాతంలోపే ఉండేలా చూసుకోవాలన్నారు. ప్రభుత్వ నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా పంట ఉండాలన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఓఎన్‌ఓఎస్ పథకం.. విద్యార్థులకు వరం



సభ్యత్వ పత్రాన్ని చూపుతున్న వైవీయూ వీసీ ఆచార్య కృష్ణారెడ్డి

కడప ఎడ్యుకేషన్: యోగి వేమన విశ్వవిద్యాలయ ఏపీజే అబ్దుల్ కలాం గ్రంథాలయం వన్ నేషన్ వన్ సబ్‌స్క్రిప్షన్ (ఒ.ఎన్.ఒ.ఎస్) పథకం సభ్యత్వాన్ని పొందిందని తద్వారా వేలాది ఆన్లైన్ గ్రంథాలు విద్యార్థులు చదువుకునేందుకు యాక్సెస్ లభించిందని వీసీ కె. కృష్ణారెడ్డి అన్నారు. వన్ నేషన్ వన్ సబ్‌స్క్రిప్షన్ ఈ–జర్నల్స్ యాక్సెస్ పత్రాన్ని విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కృష్ణారెడ్డి, ప్రధాన ఆచార్యులు ఎస్.రఘునాథ్ రెడ్డి, కులసచివులు ఆచార్య పి. పద్మ లైబ్రరీ అసిస్టెంట్ డాక్టర్ డి. ప్రసాద్ రావు, ఆర్. విజయ కుమార్ అందజేశారు. భారతదేశంలోని విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలకు స్కాలర్లు, పరిశోధకుల పరిశోధనా వ్యాసాలు, జర్నల్‌లను శోధించవచ్చన్నారు. అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులందరూ తమ విద్యా, వత్తిపరమైన కార్యకలాపాలను ముందుకు తీసుకెళ్లేందుకు ఈ విలువైన వనరును ఉపయోగించుకోవాలని సూచించారు.

నమస్తే.. డ్రైవరన్నా!



ఇంట్లో ఎన్ని కష్టాలున్నా..
ఒంట్లో ఎన్ని బాధలున్నా.. డ్యూటీ ఎక్కిన మరుక్షణం ఆయన ఒళ్లంతా అటెన్షన్‌గా మారిపోతుంది.. కంటి చూపు రెట్టింపవుతుంది. మనసంతా పనిపైనే నిమగ్నమవుతుంది.. ఆ క్షణం తన వెనకాలనున్న యాభైమంది ప్రజలకు ఆయనో దేవుడు.. ఆయనే డ్రైవరు. ఇటు ప్రయాణికుల భద్రత, క్షేమానికి.. అటు యాజమాన్యానికి అందించే లాభాలకు మధ్య వారధి.. రథ సారథి ఆయనే.. నీ సేవలకు సలాం .. డ్రైవరన్నా.

- ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానం చేర్చడమే వారి బాధ్యత
- రద్దీని తట్టుకుంటూ ఓపిక తెచ్చుకుంటూ నడుపుతున్న వైనం
- నియామకాలు లేకపోవడంతో ఉన్నవారిపై పనిభారం
- నేడు రాష్ట్ర రోడ్డు రవాణా డ్రైవర్ల దినోత్సవం



బస్సును ఏకాగ్రతతో నడుపుతున్న డ్రైవర్ (ఫైల్)

బద్వేలు: ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానానికి చేర్చడంలో డ్రైవర్ల పాత్ర కీలకం. రాత్రి, పగలు తేడా లేకుండా డ్యూటీల్లో ఉంటారు. ఎండా వానా, చలి వంటి పరిస్థితులను తట్టుకుని నిబద్ధతతో బాధ్యతలు నిర్వహిస్తారు. వేళ కాని వేళల్లో డ్యూటీకి పిలిచినా వెళ్లాల్సి ఉంటుంది. జనవరి 24 రాష్ట్ర రోడ్డు రవాణా డ్రైవర్ల దినోత్సవం సందర్భంగా ఏపీఎస్ ఆర్టీసీ డ్రైవర్ల విధులు.. పనితీరుపై ప్రత్యేక కథనం.

- వైయస్సార్ కడప జిల్లా పరిధిలో 6 బస్సు డిపోలు ఉన్నాయి. పులివెందుల,కడప,బద్వే లు , మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు డిపోల్లో దాదాపు 1,200 మంది డ్రైవర్లుగా విధులు నిర్వహిస్తున్నారు. వీరు ప్రతిరోజూ 1.5 లక్షల మందిని గమ్యస్థానాలకు చేర్చుతున్నారు.

నియామకాలు లేకపోవడంతో ఉన్నవారిపైనే పనిభారం

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో 11 ఏళ్లుగా నియామకాలు చేపట్టలేదు. వేల మంది డ్రైవర్లు ఉద్యోగ విరమణ, మెడికల్ అన్‌ఫిట్ పొందుతున్నారు. నియామకాలు లేకపోవడంతో ఉన్న డ్రైవర్లతోనే డబుల్ డ్యూటీలు చేయిస్తున్నారు. దీంతో డ్రైవర్లకు సరైన విశ్రాంతి ఉండటం లేదు. రిటైర్డు అయిన డ్రైవర్లకు పెన్షన్ తక్కువ మొత్తంలో వస్తోంది. దీంతో చాలా మంది డ్రైవర్లు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు.

ప్రభుత్వాలు ఆదుకోవాలి

నిత్యం ప్రయాణికుల క్షేమం కోరుతూ వారిని గమ్యానికి సురక్షితంగా చేరుస్తున్న తమకు తమ కుటుంబాలను ఆదుకునే విధంగా పథకాలు రూపొందించాలని ఆర్టీసి డ్రైవర్లు కోరుతున్నారు. ముఖ్యంగా కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు ఉచిత ప్రమాద బీమా అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. పిల్లల చదువులకు అవసరమైన ఆర్థిక సహాయం చేయాలని కోరుతున్నారు. రాష్ట్రంలో ఏటా పది లక్షల వివిధ రకాల వాహనాలు రోడ్డు పైకి వస్తున్నాయి. వాహనాలు పెరుగుతున్నత వేగంగా రోడ్ల విస్తరణ చేపట్టడంలేదు.సరికదా ఉన్న రోడ్డులను ఆక్రమించుకుని నిర్మాణాలు చే పడుతున్నారు.దీంతో డ్రైవర్లపై ఒత్తిడి పెరిగి అనారోగ్యం పాలవుతున్నారు. దీనికి తోడు కండిషన్ లేని బస్సులతో నడపాలంటేనే చాలా ఇబ్బందులు పడుతున్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు డ్రైవర్ల కష్టాలను గుర్తించి సమస్యలు పరిష్కరిస్తే మరింత భద్రంగా ప్రజల క్షేమం కోసం పాటుపడతామని డ్రైవర్లు కోరుతున్నారు.





బద్వేలు ఆర్టీసీ బస్టాండ్

ఒత్తిడి ఎక్కువైంది..



నేను పదిహేనేళ్లుగా ఆర్టీసీ డ్రైవరుగా పనిచేస్తున్నాను. డ్యూటికి వచ్చి డ్రైవర్ సీట్లో కూర్చుంటే ఇంటి దగ్గర ఉండే భార్యాబిడ్డలు గుర్తుకురారు. రోడ్డుపై రద్దీగా ఉన్న ప్రజలతో పాటు కుంటి వారిని గుడ్డి వారిని, అన్నిరకాల వాహనాలను తప్పించుకుంటూ ఓపిగ్గా ప్రయాణికులను వారి గమ్య స్థానాలకు చేర్చడంలోనే నిమగ్నమైపోతాం. వాహనాల రద్దీ పెరిగింది. రోడ్లు ఇరుకుగా ఉండటంతో ట్రాఫిక్ తప్పించుకుని పోవాలంటే ఒత్తిడి పెరుగుతోంది.
–సి.పిచ్చయ్య,ఆర్‌టిసి డ్రైవర్,బద్వేలు డిపో

ప్రయాణికుల క్షేమమే ధ్యేయం



ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానం చేర్చడమే మా ధ్యేయంగా భావిస్తాం. ప్రయాణికులే మా సంస్థకు దేవుళ్లు.వారి వల్ల సంస్థకు ఆదాయం వస్తే మాకు జీవనోపాధి ఉన్నట్లు. అందుకే రోడ్డుపై ఎన్నిరకాలుగా అడ్డంకులు ఉన్నా ఓపికతో వారిని గమ్యస్థానానికి చేర్చుతున్నాం. బస్సులు మంచి కండిషన్‌లో ఉంటే మాకు కొంచెం ఒత్తిడి తగ్గుతుంది.
–హరినాథ్,ఆర్‌టిసి డ్రైవర్ బద్వేలు డిపో

11న అరుణాచలానికి ప్రత్యేక సర్వీసులు

- జిల్లాలోని ఆరు డిపోల నుంచి బస్సుల ఏర్పాటు

కడప కోటిరెడ్డిసర్కిల్: పౌర్ణమిని పురస్కరించుకుని ఫిబ్రవరి 11న ప్రముఖ పుణ్యక్షేత్రమైన అరుణాచలానికి ప్రత్యేక సర్వీసులను నడుపనున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. ప్రయాణికుల భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఈ సర్వీసులను పవిత్ర క్షేత్రానికి వెళ్లేవారు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. భక్తులు తమ టిక్కెట్లనుముందుగా రిజర్వు చేసుకోవాలన్నారు.

- కడప డిపోకు సంబంధించి మధ్యాహ్నం 3 గంటగలకు సూపర్ లగ్జరీ సర్వీసు బయలుదేరి రాయచోటి, చిత్తూరు, వేలూరు మీదుగా అరుణాచలం వెళుతుందన్నారు. ఇందులో టిక్కెట్ ధరను రూ. 1072గా ఉంటుందన్నారు.
- బద్వేలు డిపోకు సంబంధించి అల్ట్రాడీలక్స్ సర్వీసు మధ్యాహ్నం 2 గంటలకు బయలుదేరి పెంచలకోన, శ్రీకాళహస్తి, గోల్డెన్ టెంపుల్, కాణిపాకం మీదుగా వెళుతుందన్నారు. ఇందులో చార్జీగా రూ. 1176లు.
- మైదుకూరు డిపోకు సంబంధించి సాయంత్రం 6 గంటలకు సూపర్ లగ్జరీ సర్వీసు పోరుమామిళ్లలో బయలుదేరి కడప, కాణిపాకం గోల్డెన్ టెంపుల్ మీదుగా వెళుతుందన్నారు. ధర రూ. 1209లు.
- ప్రొద్దుటూరు డిపోకు సంబంధించి సాయంత్రం 6 గంటలకు సూపర్‌లగ్జరీ సర్వీసు బయలుదేరి మైదుకూరు,కడప మీదుగా అరుణాచలం వెళుతుందన్నారు. ఇందులో ఛార్జిగా రూ. 1273లు.
- పులివెందుల డిపోకు సంబంధించి ఉదయం 7 గంటలకు అల్ట్రా డీలక్స్ సర్వీసు రాయచోటి పీలేరు మీదుగా అరుణాచలం వెళుతుందన్నారు. ఇందులో టిక్కెట్ ధర రూ. 1183గా నిర్ణయించారన్నారు.
- జమ్మలమడుగు డిపో నుంచి ఉదయం 7.00 గంటలకు సూపర్‌లగ్జరీ బస్సు ప్రొద్దుటూరు, మైదుకూరు, కడప మీదుగా వెళుతుందన్నారు. ఇందులో ఛార్జీగా రూ. 1568 ఉందని వివరించారు.

వేధింపుల అధికారికి కోటింగ్

- తన కింది స్థాయి మహిళా అధికారి, ఉద్యోగులకు తప్పని కష్టాలు
- నోరు మెదిపితే 'పరువు' పోతుందని లోలోపల కుమిలిపోతున్న వైనం
- ఎట్టకేలకు మహిళా అధికారి భర్త చేతిలో దెబ్బలు తిన్న జిల్లా అధికారి
- కాళ్లబేరానికి రావడం, సహచర అధికారుల బుజ్జగింపుతో సద్దుమణిగిన వ్యవహారం

సాక్షి, టాస్క్‌ఫోర్స్: తమ కింది స్థాయి మహిళా అధికారులపట్ల అసభ్యంగా ప్రవర్తించడం, మెసేజ్‌ల ద్వారా వేధించడం లాంటి వెకిలి, వికృత చేష్టలకు అక్కడి మహిళా అధికారులు, ఉద్యోగులు విసిగి వేసారిపోయారు. నోరు మెదిపితే తమ పరువు, ప్రతిష్టలకు భంగం కలుగుతుందని, ఆ అధికారి వేధింపులను పంటిబిగువున అదిమిపెట్టుకున్నారు. ఈ వేధింపుల పర్వం కాస్త మరింత ఎక్కువైంది. సదరు మహిళా అధికారి, ఉద్యోగి ఇళ్లను వెతుక్కుంటూ వెళ్లడం, పదేపదే వారిని వేధించడం పరాకాష్టకు చేరుకుంది. ఎట్టకేలకు బాధిత మహిళా అధికారి తన భర్తకు విషయం తెలియజేసింది. ఆయన గురువారం జిల్లా కార్యాలయంలోకి నేరుగా వచ్చి అధికారితో మొదట వాగ్వాదానికి దిగి నిలదీశారు. తరువాత భర్త చేతిలో ఆ అధికారి దెబ్బలు కూడా తిన్నారు. ఈ హఠాత్ పరిణామానికి సహచర అధికారులు, సిబ్బంది అధికారి భర్తకు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. చివరకు తాను మహిళా అధికారి జోలికి వెళ్లనని, మహిళా ఉద్యోగుల పట్ల మర్యాదగా మసలుకుంటానని కాళ్లబేరానికి రావడంతో అప్పుడు బాధిత అధికారి భర్త శాంతించారు. మరలా ఇలాంటి సంఘటనలు పునరావృతమైతే పోలీసులకు ఫిర్యాదు చేసి చట్టపరంగా చర్యలు తీసుకునేదాకా వదిలిపెట్టమని హెచ్చరించి వెళ్లారు. ఈ జిల్లా కార్యాలయం కడప– రాయచోటి ప్రధాన రహదారిలో కడప నగరానికి కూతవేటు దూరంలో ఉంది. ఇంకా ఇక్కడి ఉద్యోగులు ఒక్కొక్కరే తమ అధికారి వేధింపులను వెళ్లబోసుకుంటున్నారు. అయితే ఈ సంఘటన బయటకు పొక్కకుండా అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించడం కొసమెరుపు.

దేవునికడప రథోత్సవానికి ఏర్పాట్లు

- కమిషనర్ మనోజ్‌రెడ్డి

కడప కార్పొరేషన్: దేవునికడప రథోత్సవానికి తగిన ఏర్పాట్లు చేయాలని నగరపాలక కమిషనర్ మనోజ్ రెడ్డి ఆదేశించారు. గురువారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా ఆయన రామరాజుపల్లె, దేవునికడప, రాయల్‌హాల్, పాత బస్టాండ్ ప్రాంతాలను పరిశీలించారు. రామరాజుపల్లె అహ్మదీయ నగర్ ప్రాంతాన్ని పరిశీలించి రోడ్డు, డ్రైనేజీ కాలువ కోసం ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. నిల్వ ఉన్న నీటిని గల్వర్ మిషన్‌తో తొలగించాలన్నారు. దేవునికడప రథోత్సవం సందర్భంగా ప్యాచ్ వర్క్, పార్ట్ హోల్స్ మరమ్మతులు చేయాలన్నారు. లక్ష్మి వెంకటేశ్వరస్వామి పుష్కరిణి వద్ద డ్రైనేజీ నీరు సజావుగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలన్నారు. పాతబస్టాండ్, రాయల్‌హాల్, ఆంజనేయస్వామి దేవాలయం సమీపంలోని చెత్త పాయింట్లను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. పాత బస్టాండులోని అన్న క్యాంటీన్‌ను పరిశీలించి భోజనం నాణ్యతపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈఈ నారాయణ స్వామి, డిఈఈ రాజేష్, ఎంహెచ్ఓ డా. చంద్రశేఖర్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

నిధులు.. నీళ్లపాలు

- శానిటేషన్ పేరిట నిధుల గోల్‌మాల్
- నాయకుల పేరిట రూ.22 లక్షలు ఖర్చు
- కారణం చూపని టీడీపీ సర్పంచ్, ఆమె భర్త

పెద్దతిప్పసముద్రం: తంబళ్లపల్లి నియోజకవర్గంలోని పెద్దతిప్పసముద్రం మండలం పోతుపేట పంచాయతీ 1160 మంది ఓటర్లు ఉన్న చిన్న గ్రామం. సమాచార హక్కు చట్టం ద్వారా గ్రామ పంచాయతీకి నిధుల మంజూరు, ఖర్చు వివరాలను దరఖాస్తుదారుడికి అధికారులు ఇవ్వడంతో అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. కొత్తగా ఏర్పడిన ఈ గ్రామ పంచాయతీకి 2019 ఆర్థిక సంవత్సరం నుంచి ఇప్పటి వరకు రూ.27,66,351 లక్షలు మంజూరయ్యాయి. వీటిని వాటర్ వర్క్స్, శానిటేషన్, పైప్‌లైన్, సీసీ రోడ్లు, వీధి దీపాల ఏర్పాటు, డేటా ఎంట్రీ ఆపరేటర్, సర్పంచ్ జీతాల రూపంలో రూ.22,12,902 ఖర్చు చేసినట్లు చూపించగా ప్రస్తుతం రూ.5,53,449లు గ్రామ పంచాయతీలో నిల్వ ఉన్నాయి. జల్ జీవన్ మిషన్ నిధులతో యంపార్లపల్లి, పిడుంవారిపల్లిలోని రెండు ప్రభుత్వ బోర్లకు కొత్త మోటార్లు అమర్చారు. అయితే పంచాయతీ ఆవిర్భావం నుంచి మంజూరైన నిధులతో కేవలం 200 మీటర్ల లోపు పైప్‌లైన్ పనులు, పోతుపేటలో తాగునీటి ట్యాంకుకు నిచ్చెన ఏర్పాటు అది కూడా పాత బోరు పైపులతో, పోతుపేటలోని ప్రభుత్వ బోరులో లీకేజీ పైపులను వెలికి తీయడం తప్ప ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేదు. పిడుంవారిపల్లి, చేలూరివాండ్లపల్లి రెండు చోట్లా కలిపి 130 మీటర్ల మేరకు మురికి నీటి కాలువలు ఉన్నాయి. వాటిని శుభ్రపరచిన దాఖలాలే లేవని ప్రజల వాదన. పోతుపేట, యంపార్లపల్లిలో ఒక మీటర్ మురికి కాలువ కూడా లేదు. డ్రైనేజీ వ్యవస్థ లేకున్నా శానిటేషన్ పేరిట రూ. లక్షల నిధులను డ్రా చేసేశారు. పైప్‌లైన్ పనుల పేరిట 13 రోజుల వ్యవధిలోనే రూ.99, 800ల చొప్పున రెండు సార్లు నిధులు డ్రా చేయడం, సిమెంట్ రోడ్డు వేయకున్నా రూ.1,31 లక్షలను మెక్కేయడం గమనార్హం. అంతేగాక టీడీపీ మహిళా సర్పంచ్, ఆమె భర్తతో పాటు మండల పరిషత్ కార్యాలయంలో పని చేసే ఓ వ్యక్తి పేరిట రూ.5 లక్షలకు పైగా నిధులు డ్రా చేసినా ఎందుకు ఖర్చు పెట్టారో అధికారులు కారణాలను కనబరచకపోవడం గమనార్హం. రూ.లక్షల నిధుల దుర్వినియోగంపై ఆడిటింగ్ అధికారుల ధోరణిపై పంచాయతీ ప్రజలు మండి పడుతున్నారు.

సై అంటే సై!

- తెలుగు తమ్ముళ్ల మధ్య తారాస్థాయికి విబేధాలు
- అగ్రనేతలు మొదలుకొని క్యాడర్‌లోనూ అదే పరిస్థితి
- ఇటీవల అన్నా క్యాంటీన్ ప్రారంభోత్సవంలో తోపులాటలు
- తంబళ్లపల్లె నియోజకవర్గంలో బ్యానర్లు చించి, కేకులు ధ్వంసం

సాక్షి రాయచోటి: సార్వత్రిక ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి సర్కార్‌లో ఆర్థిక యుద్ధాలు మొదలయ్యాయి. ఎక్కడికక్కడ..ఎవరికి వారు ఆధిపత్యం కోసం కాలు దువ్వుతున్నారు. ఆది నుంచి అధికార పార్టీలో కుమ్ములాటలు కొనసాగుతున్నాయి. అయితే ప్రధానంగా నియోజకవర్గాల్లో పెత్తనం చెలాయించేందుకు కీలక నేతలు కూడా పోటీ పడుతున్నారు. అధిష్టానం మాత్రం ఇంతవరకు ఓడిపోయిన నియోజకవర్గాల్లో ఇన్‌చార్జిలనుకూడా ప్రకటించలేని పరిస్థితి కొనసాగుతుండగా..తమ్ముళ్ల మధ్య తగువులాటలు యదా రాజా...తథా ప్రజా అన్నట్లుగా జరుగుతున్నాయి. సంపాదించుకోవడం తోపాటు ఆధిపత్యం విషయంలో వర్గాల మధ్య తీవ్ర స్థాయి పోటీ నెలకొనడంతో నువ్వా, నేనా అన్న పరిస్థితులు నెలకొన్నాయి. జిల్లాలోని నియోజకవర్గాల్లోని టీడీపీ శ్రేణుల మధ్య వర్గాలు ఏర్పడి చివరకు సై అంటే...సైసై అంటూ కాలు దువ్వుతున్నారు.

రాజంపేటలో పచ్చగడ్డివేస్తే భగ్గుమనేలా..

అన్నమయ్య జిల్లా రాజంపేట టీడీపీలో వర్గ విబేధాలు తారా స్థాయికి చేరుకున్నాయి. ఒకవైపు జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, మరో వైపు గత ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన సుగవాసి బాలసుబ్రమణ్యం వర్గాల మధ్య పోటాపోటీ పరిస్థితులు నెలకొన్నాయి. గత ఆగస్టులో అన్నా క్యాంటీన్ ప్రారంభోత్సవ సందర్భంగా రిబ్బన్ కత్తిరించే విషయంలో కీలక నేతలైన జగన్‌మోహన్‌రాజు, బాలసుబ్రమణ్యంలు తోసుకోవడంతో క్యాకర్తలు విస్తుపోయారు. ఎక్కడికక్కడ శ్రేణులు కూడా గ్రూపులుగా ఏర్పడ్డాయి. ఒక వర్గం అంటే మరొక వర్గానికి పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి నెలకొంది. ఇటీవల ఒంటిమిట్టలో జరిగిన రెవెన్యూ సదస్సులో రెండు వర్గాల మధ్య వాగ్వాదాలు, బహిరంగ సవాళ్లు చోటుచేసుకున్నాయి. ప్రస్తుతం పార్టీకార్యక్రమమైనా, అధికారిక కార్యక్రమమైనా ఒక వర్గం పాల్గొంటున్నా మరొకవర్గం అలజడులు రేపుతోంది. రాజంపేట నియోజకవర్గానికి సంబంధించి ఇప్పటికీ ఇన్‌ఛార్జిని టీడీపీ ప్రకటించలేక పోతోంది.



రైల్వేకోడూరులో పెరిగిన గ్రూపులు

రైల్వేకోడూరు నియోజకవర్గంలో కార్యకర్తల మధ్య గ్రూపులు పెరిగిపోయాయి. స్థానికంగా జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్ ఉన్నప్పటికీ పెత్తనమంతా అధికార పార్టీకి చెందిన రూపానందరెడ్డి కుటుంబానిదేనని జగమెరిగిన సత్యం. అక్కడ అంతా కుటుంబ పాలనే కొనసాగుతోంది. టీడీపీ మాజీ ఇన్‌ఛార్జి కస్తూరి విశ్వనాథనాయుడు వర్గంతోపాటు మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల్రాయులు వర్గం జనసేన నేతలకు కూడా సరిపోవడం లేదు. దీంతో ఎవరికి వారుగా వర్గాలుగా విడిపోవడంతో అయోమయ పరిస్థితి నెలకొంది. అధికారులకు కూడా ఒక వర్గం ఒక పని చేయాలని చెబితే....మరొక వర్గం అది చేయవద్దని హుకుం జారీ చేస్తుండటం గమనార్హం. అక్కడ కూడా వర్గాల మధ్య లోలోపల అంతర్యుద్ధం కొనసాగుతోంది. అయితే అధికార పార్టీలో ఉన్న రూపానందరెడ్డి కుటుంబీకులు చెప్పిన పనులే జరుగుతుండడం పార్టీలో ఇతర వర్గాలకు ఎంతమాత్రం రుచించడం లేదు. మదనపల్లెలోనూ ఎమ్మెల్యే షాజహాన్‌బాషకు వ్యతిరేకంగా కొన్ని వర్గాలు బయట పడకుండా లోలోపల వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నాయి. ఇలా జిల్లా అంతటా టీడీపీలో వర్గ విబేధాలు కొనసాగుతూ నేతలు, కార్యకర్తలతో పాటు అధికారులకు తలనొప్పిగా మారాయని పలువురు పేర్కొంటున్నారు.

రాయచోటిలోనూ ఇంతే..

జిల్లా కేంద్రమైన రాయచోటిలోనూ కింది స్థాయి క్యాడర్‌లో అసమ్మతితోపాటు వర్గ విబేధాలు కొనసాగుతున్నాయి. మూడు రోజుల కిందట లక్కిరెడ్డిపల్లెలో టీడీపీలోని రెండు వర్గాల వారు దాడులు చేసుకున్నారు. సంక్రాంతికి ముందుకూడా రాయచోటిలోని గునికుంట్ల రోడ్డు చివరన ఉన్న చెరువుకట్ట వద్ద ఇరు వర్గాలు రాడ్లతో కొట్టుకోగా, మళ్లీ ఆ రెండు వర్గాల మధ్య జగదాంబసెంటర్ వీధిలోనూ గొడవ జరిగి ఒక టాటూ సెంటర్‌కు నిప్పు పెట్టారు. ఇలా రాయచోటిలో కార్యకర్తలు, నేతల మధ్య అంతర్యుద్ధం కొనసాగుతోంది. ఇటీవల పది రోజుల వ్యవధిలో రాయచోటిలో సుగవాసి వర్గీయుల బ్యానర్‌ను మంత్రి వర్గీయులు తొలగించగా.. మంత్రి అనుచరులు ఏర్పాటుచేసిన బ్యానర్‌ను సుగవాసి వర్గానికి చెందినవారు చించివేశారు. ఈనేపథ్యంలో మంత్రి అనుచరులు పోలీస్ స్టేషన్ వెళ్లి ఫిర్యాదు చేయడం కాక రేపుతోంది.

తంబళ్లపల్లెలో ముదిరిన వర్గపోరు

జిల్లాలోని తంబళ్లపల్లె నియోజకవర్గంలో నేతల మధ్య వర్గపోరు ముదిరింది. ప్రధానంగా అధికారుల బదిలీలు మొదలుకొని వర్గాల మధ్య ప్రచ్ఛన్నయుద్ధం అధికమైంది. ఇక్కడ సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ తరుపున పోటీ చేసిన జయచంద్రారెడ్డి,మాజీ ఎమ్మెల్యే శంకర్ యాదవ్ వర్గీయుల మధ్య విబేధాలు కొనసాగుతున్నాయి. ఇప్పటికే నియోజకవర్గానికి చెందిన పలువురు నేతలు వెళ్లి తమకంటే తమకే ఇన్‌చార్జి పదవి కట్టబెట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబుతోపాటు ఆయన తనయుడు లోకేష్‌ను కలిసి విన్నవించారు. అయినప్పటికీ అధిష్టానం ఆ దిశగా అడుగులు వేయకపోగా, ప్రతిసారి వర్గపోరు తలనొప్పిగా మారుతోంది. తాజాగా ములకలచెరువు, తంబళ్లపల్లె, బి.కొత్తకోట ప్రాంతాల్లో వర్గాల మధ్యంయుద్ధ వాతావరణం నెలకొని మంత్రి లోకేష్ బ్యానర్లు, ఫ్లెక్సీలు ఎక్కడికక్కడ ఒక వర్గం చింపివేసి కేకులను విసిరి కొట్టారు. లోకేష్ జన్మదినం సందర్భంగా రెండు వర్గాల మధ్య ముష్టియుద్ధం చోటుచేసుకుంది.

క్లుప్తంగా

స్టాఫ్‌నర్సు ఉద్యోగాల్లో తొలి ప్రాధాన్యత ఇవ్వాలి

కడప వైఎస్సార్ సర్కిల్ : కరోనా సమయంలో తమ ప్రాణాలను ఫణంగా పెట్టి ప్రజలకు వైద్య సేవలు అందించిన వారికి, స్టాఫ్‌నర్సు ఉద్యోగాల్లో మొదటి ప్రాధాన్యత కల్పించాలని రాయలసీమ ట్రేడ్ యూనియన్ నగర కార్యదర్శి మడగలం ప్రసాద్ కోరారు. గురువారం నగరంలోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వైద్య రంగానికి సంబంధించిన 150 స్టాఫ్‌నర్సు పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరించారన్నారు. ఇందులో కరోనా సమయంలో పని చేసిన వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఆనాడు వారు చేసిన సేవలు వెలకట్టలేనివని చెప్పారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్, వైద్య శాఖ ప్రధాన అధికారులకు, వైద్య ఆరోగ్యశాఖ మంత్రికి వినతిపత్రాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో విజయకుమార్ పాల్గొన్నారు.

ఏ.ఆర్. సిబ్బందికి ఫైరింగ్‌పై శిక్షణ



ఫైరింగ్ శిక్షణలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) కె. ప్రకాష్‌బాబు, పోలీసు అధికారులు, సిబ్బంది

కడప అర్బన్ : జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు ఏ.ఆర్. పోలీసులకు గురువారం ఫైరింగ్‌పై శిక్షణ ఇచ్చారు. అదనపు ఎస్పీ (అడ్మిన్) కె. ప్రకాష్‌బాబు ఆధ్వర్యంలో ఏ.ఆర్ అదనపు ఎస్పీ బి. రమణయ్య పర్యవేక్షణలో నగర శివార్లలోని ఫైరింగ్ రేంజ్‌లో ఏ.ఆర్. పోలీసులకు వివిధ రకాల తుపాకులతో ఫైరింగ్‌పై శిక్షణ నిర్వహించారు. మొబిలైజేషన్‌లో భాగంగా వార్షిక ఫైరింగ్‌లో పాల్గొన్న సిబ్బంది వృత్తి నైపుణ్యం పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏ.ఆర్.డీఎస్పీ శ్రీనివాసరావు, ఆర్.ఐలు వీరేష్, శ్రీశైలరెడ్డి, టైటాస్, ఆర్.ఎస్.ఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా సాగిన కేఎంసీ స్పోర్ట్స్ మీట్



వాలీబాల్ ఆడుతున్న కమిషనర్ మనోజ్‌రెడ్డి



వాలీబాల్‌లో మొదటి స్థానంలో నిలిచిన స్పోర్ట్స్ స్కూల్ జట్టు

క్రీడలను ప్రారంభించిన కమిషనర్ మనోజ్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : కడప నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ స్టేడియంలో నిర్వహించిన స్పోర్ట్స్ మీట్ ఉత్సాహంగా సాగింది. 100 మీటర్ల రన్నింగ్, 400 మీటర్ల రన్నింగ్ నిర్వహించారు. ఉదయం 9 గంటలకు కమిషనర్ మనోజ్‌రెడ్డి మొదట వాలీబాల్ ఆడి క్రీడలను ప్రారంభించారు. వాలీబాల్ బాలుర విభాగంలో స్పోర్ట్స్ స్కూల్ మొదటి స్థానంలో నిలవగా, విద్యామందిర్ స్కూల్ రెండో స్థానంలో, నారాయణ స్కూల్ విద్యార్థులు మూడో స్థానంలో నిలిచారు. వాలీబాల్ బాలికల విభాగంలో స్పోర్ట్స్ స్కూల్ విద్యార్థులు మొదటి స్థానంలో, మున్సిపల్ కార్పొరేషన్ ఉర్దూ అగాడి స్ట్రీట్ విద్యార్థులు రెండో స్థానంలో, మున్సిపల్ హైస్కూల్ మెయిన్ విద్యార్థులు మూడో స్థానంలో నిలిచారు. బాలికల 100 మీటర్ల రన్నింగ్‌లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని ఎం. శ్రీలత రెడ్డి మొదటి స్థానంలో, స్పోర్ట్స్ స్కూల్ విద్యార్థిని వేదవర్షిని రెండో స్థానంలో, అంబేడ్కర్ స్కూల్ విద్యార్థిని కీర్తన మూడో స్థానంలో నిలిచారు. బాలుర 100 మీటర్ల రన్నింగ్‌లో స్పోర్ట్స్ స్కూల్ విద్యార్థి బి. రాముడు, గాంధీనగర్ స్కూల్ విద్యార్థి తిమోతి, కడప పబ్లిక్ స్కూల్ విద్యార్థి ఎల్. జస్వంత్‌రెడ్డి మూడో స్థానాన్ని కైవసం చేసుకున్నారు. అనంతరం 400 మీటర్ల రిలే పరుగు పందెంలో విద్యామందిర్ స్కూల్ విద్యార్థులు మొదటి స్థానంలో, మున్సిపల్ కార్పొరేషన్ ఉర్దూ సాలే నాగయ్య స్కూల్ విద్యార్థులు రెండో స్థానాన్ని, మున్సిపల్ కార్పొరేషన్ స్కూల్ నాగరాజుపేట విద్యార్థులు మూడో స్థానంలో నిలిచారు. రేపు కబడ్డీ, బాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తామని కమిషనర్ తెలిపారు.

కళ్లను జాగ్రత్తగా కాపాడుకోవాలి

జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) కె. ప్రకాష్‌బాబు, ఏఆర్ అదనపు ఎస్పీ బి.రమణయ్య



కంటిపరీక్షలను చేయించుకుంటున్న ఏ.ఆర్ సిబ్బంది

కడప అర్బన్ : జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు ఏ.ఆర్ మొబిలైజేషన్‌లో భాగంగా పుష్పగిరి కంటి ఆసుపత్రిలో ఎం.టి (మోటార్ ట్రాన్స్‌పోర్ట్) విభాగం డ్రైవర్ సిబ్బందికి గురువారం కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ (అడ్మిన్) కె. ప్రకాష్‌బాబు, ఏ.ఆర్ అదనపు ఎస్పీ బి. రమణయ్య మాట్లాడుతూ మన అవయవాల్లో అన్నిటికంటే ముఖ్యమైనవి కళ్లు అన్నారు. అందుకే సర్వేంద్రియానాం నయనం ప్రధానం అంటారన్నారు. కళ్లు అనేవి మనకు దేవుడిచ్చిన అపురూపమైన నిధి అని వాటిని జాగ్రత్తగా చూసుకోవడం మన విధి అని అన్నారు. 90 మంది పోలీసు వాహన డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. పుష్పగిరి కంటి ఆసుపత్రి యూనిట్ హెడ్ వి. సూర్యప్రకాష్‌కు జిల్లా పోలీసు శాఖ తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ.ఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, ఆర్.ఐ వీరేష్, పోలీస్ అధికారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పుశంకర్ పాల్గొన్నారు.

ఘనంగా డాక్టర్ ఈసీ గంగిరెడ్డి జయంతి



డాక్టర్ ఈసీ గంగిరెడ్డి చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, నాయకులు

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక శ్రీనివాస థియేటర్ సమీపంలో మెకానిక్ శేఖర్ ఆధ్వర్యంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ ఈసీ గంగిరెడ్డి జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ డాక్టర్ ఈసీ గంగిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఈసీ గంగిరెడ్డి పులివెందుల ప్రాంత ప్రజలకు చేసిన సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ చిన్నప్ప, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్లు హాలు గంగాధర్ రెడ్డి, హఫీజ్, వైఎస్సార్‌సీపీ నూర్ బాషా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రసూల్, జేసీఎస్ కన్వీనర్ పార్నపల్లి కిశోర్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు యార్వ వెంకట సుబ్బయ్య, కౌన్సిలర్లు గండి రాము, ఖాదర్, కో.ఆప్షన్ సభ్యుడు చంద్రమౌళి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ కోళ్ల భాస్కర్, వైఎస్సార్‌సీపీ నాయకులు హరి, రాయుడు, మహమ్మద్, శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

నకిలీ డాక్యుమెంట్లతో పంట రుణం తీసుకున్న వ్యక్తి అరెస్టు



నిందితుడితో సీఐ ఎస్‌కే రోషన్, ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి

కమలాపురం : అక్రమ ధనార్జన కోసం నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి పంట రుణాలను తీసుకున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు కమలాపురం సీఐ ఎస్‌కే రోషన్, ఎస్ఐ ప్రతాప్ రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు. మండలంలోని చెన్నంపల్లెకు చెందిన మూల నాగేశ్వర్ రెడ్డి అనే వ్యక్తి అక్రమ ధనార్జన కోసం నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి పంట రుణాలు తీసుకుని రైతులను ఇబ్బందికి గురి చేస్తున్నాడన్నారు. గతంలో ఎల్లారెడ్డిపల్లెలో పనిచేసిన ఒక వీఆర్ఓ ఇతరులకు చెందిన భూములను, కొండలను, గుట్టలను, డీకేటీ భూములను తనకు అనుకూలమైన వారికి నకిలీ పత్రాల ద్వారా ఆన్‌లైన్‌లో ఎక్కించి బ్యాంకుల్లో అకౌంట్ ఓపెన్ చేసి రుణాలు పొందేవారన్నారు. ఈ నేపథ్యంలో నాగేశ్వరరెడ్డి, ఎల్లారెడ్డిపల్లె గ్రామ పంచాయతీలోని సర్వే నంబర్ 645లో గండి సుబ్బలక్షుమ్మ అనే మహిళా రైతుకు చెందిన భూమి రికార్డులను నకిలీ ఆధార్ కార్డు ద్వారా తన పేరుపై మ్యుటేషన్ చేసుకుని నకిలీ పాసు బుక్కులు పొందాడన్నారు. తద్వారా ప్రొద్దుటూరులోని కెనరా బ్యాంకులో 2022 సెప్టెంబర్‌లో రూ.2.5 లక్షల రుణం పొందాడన్నారు. బాధిత మహిళా రైతు సుబ్బలక్షుమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడు నాగేశ్వర్ రెడ్డిని అరెస్ట్ చేశామన్నారు. అతడి వద్ద ఉన్న నకిలీ డాక్యుమెంట్లు, నకిలీ పాస్ బుక్కులను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించామన్నారు. అలాగే ఈ కేసుకు సంబంధించి ప్రమేయం ఉన్న మరి కొందరిని త్వరలో అరెస్ట్ చేస్తామని వారు వివరించారు.

జిల్లా ఆస్పత్రి నుంచి వృద్ధుడి అదృశ్యం



వెంకటసుబ్బారెడ్డి (ఫైల్)

ప్రొద్దుటూరు క్రైం : జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అప్పలరెడ్డి వెంకట సుబ్బారెడ్డి అనే 70 ఏళ్ల వృద్ధుడు ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు. ఔట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మైదుకూరు మండలంలోని గంజికుంట గ్రామానికి చెందిన వెంకటసుబ్బారెడ్డి ఆరోగ్యం సరిగా లేకపోవడంతో గురువారం ఉదయం జిల్లా ఆస్పత్రిలో చేర్పించారు. అతనికి తోడుగా భార్య వెంకటలక్షుమ్మ కూడా ఉండేది. చికిత్స పొందుతున్న అతను గురువారం సాయంత్రం ఎవరికీ చెప్పకుండా వార్డులో నుంచి వెళ్లిపోయాడు. భార్య వెంకటలక్షుమ్మ ఆస్పత్రి అంతా తిరిగినా అతను ఎక్కడా కనిపించలేదు. దీంతో ఆమె ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం అందించింది. వృద్ధుడి ఆచూకీ తెలిసిన వారు ప్రొద్దుటూరు టూ టౌన్ పోలీస్‌స్టేషన్ లేదా ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం అందించాలని ఔట్‌పోస్టు ఇన్‌చార్జి షబ్బీర్‌బాషా తెలిపారు.

సత్ప్రవర్తనతో విద్యను అభ్యసించాలి

జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. బాబా ఫకృద్దీన్



గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో ఆహారాన్ని పరిశీలిస్తున్న జడ్జి ఎస్. బాబా ఫకృద్దీన్

కడప అర్బన్ : పిల్లలు సత్ప్రవర్తనతో విద్యను అభ్యసించాలని జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. బాబా ఫకృద్దీన్ తెలిపారు. గురువారం కడప నగర శివార్లలోని చిన్నచౌక్‌లో ఉన్న ఆంధ్రప్రదేశ్ ట్రైబల్ వెల్ఫేర్ గిరిజన బాలికల గురుకుల పాఠశాలను సందర్శించారు. వంట గదులను, వసతి గదులను, టాయిలెట్స్, ఫ్యాన్‌లు, లైట్లు పరిశీలించారు. తగినన్ని ఫ్యాన్లు, లైట్లు లేకపోవడం గమనించి ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడారు. పిల్లలు విద్య, ఆరోగ్య విషయాల పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏవైనా సమస్యలుంటే కడపలోని జిల్లా న్యాయసేవాధికారసంస్థ దృష్టికి తీసుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ట్రైబల్ వెల్ఫేర్ గిరిజన బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాలకొండల్లో శ్రీరామ అఖండ జ్యోతి



పాలకొండల్లో వెలుగుతున్న అఖండ జ్యోతి

కడప కల్చరల్ : కడప నగరంలో బుధవారం శ్రీరామ మహా శోభాయాత్ర విజయవంతంగా పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని గురువారం పాలకొండల్లో భక్తులు అఖండ విజయజ్యోతిని వెలిగించారు. అయోధ్య ఐక్యవేదిక కమిటీతోపాటు పుష్పగిరి తీర్థ క్షేత్ర పరిరక్షణ కమిటీలతో హౌసింగ్‌బోర్డు శ్రీ కోదండ రామాలయ ధర్మకర్త దేసు వెంకటరెడ్డి బృందం కలిసి రావడంతో కార్యక్రమాన్ని మరింత శోభాయమానంగా నిర్వహించారు. పాలకొండల దిగువన ఆర్చి వద్ద కొండపై ప్రత్యేకంగా చదునుచేసిన ప్రాంతంలో 250 మీటర్ల వస్త్రాన్ని 50 లీటర్ల నేతిలో తడిపి చుట్టలుగా చుట్టి శివలింగం ఆకారానికి తెచ్చారు. శివ, రామ నామ స్మరణల మధ్య జిల్లా అర్చక సమాఖ్య అధ్యక్షుడు విజయ్‌భట్టర్ బృందం, న్యాయవాది భారవి తన బృందంతో జయజయధ్వానాలు చేశారు.

ఫ్లైయాష్ టిప్పర్లను అడ్డుకున్న గ్రామస్తులు

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల మండల పరిధిలోని పి.వెంకటాపురం గ్రామ ప్రజలు ఫ్లైయాష్‌ను సరఫరా చేసే టిప్పర్లను అడ్డుకున్నారు. బూడిద తమ ఇళ్లలోని సామగ్రిపైన, కళ్లల్లో పడుతోందని, అంతేకాకుండా టిప్పర్ల డ్రైవర్లు నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేస్తుండటం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. గురువారం రాత్రి గ్రామస్తులంతా ఏకంగా రోడ్డుపైకి వచ్చి ఫ్లైయాష్ టిప్పర్లను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పి.వెంకటాపురం గ్రామ ప్రజలు మాట్లాడుతూ ఈ బూడిద వల్ల చర్మ, శ్వాస కోశ వ్యాధులు వస్తున్నాయని వాపోయారు. ఈ మార్గంలో బూడిద ట్యాంకర్లు, టిప్పర్లను రానివ్వమని వారు హెచ్చరించారు.

భక్తిశ్రద్ధలతో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

కడప కల్చరల్ : తిరుమల తొలి గడప దేవుని కడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో గురువారం ఆలయంలో తిరుమంజనం సేవలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రతి సంవత్సరం బ్రహ్మోత్సవాలకు ముందు ఆలయాన్ని పూర్తిగా శుద్ధి చేసేందుకు తిరుమంజన సేవ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అందులో భాగంగా ఈ సంవత్సరం జనవరి 28వ తేది నుంచి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్న సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టారు. ఆలయ అర్చకులు, సేవకులు ఆలయ ప్రాకారం, మండపం, గర్భాలయం, బలిపీఠంతోపాటు పూజా సామగ్రిని శుద్ధి చేసి పవిత్రీకరించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు, ఇతర సిబ్బంది ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

వన్‌టౌన్ సీఐకి మెజిస్ట్రేట్ షోకాజ్ నోటీసు

ప్రొద్దుటూరు క్రైం : ఓ కేసులోని నిందితుడిని చితక బాదిన ఘటనపై ప్రొద్దుటూరు వన్‌టౌన్ సీఐ రామకృష్ణారెడ్డికి మెజిస్ట్రేట్ షోకాజ్ నోటీసు ఇచ్చారు. కోర్టు వర్గాలు తెలిపిన మేరకు ఈ నెల 19న రాత్రి సుందరాచార్యుల వీధికి చెందిన పఠాన్ మహ్మద్ ఆలీఖాన్, కేహెచ్‌ఎం స్ట్రీట్‌కు చెందిన హనీఫ్‌ల మధ్య గొడవ జరిగింది. ఈ గొడవలో పఠాన్ ఆలీఖాన్‌ను హనీఫ్ కత్తితో పొడిచాడు. ఈ ఘటనపై వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో హనీఫ్‌పై హత్యాయత్నం కేసు నమోదైంది. ఈ క్రమంలో 21న వన్‌టౌన్ పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు. విచారణలో భాగంగా వన్‌టౌన్ పోలీసులు అతన్ని బాగా కొట్టినట్లు తెలుస్తోంది. రిమాండు నిమిత్తం పోలీసులు నిందితుడిని కోర్టులో హాజరుపరిచారు. అయితే కేసులోని నిందితుడు హనీఫ్ తనను వన్‌టౌన్ సీఐ రామకృష్ణారెడ్డి ఒళ్లంతా గాయాలయ్యేలా చితకబాదినట్లు మెజిస్ట్రేట్‌కు ఫిర్యాదు చేశాడు. దీంతో మెజిస్ట్రేట్ వన్‌టౌన్ సీఐకి షోకాజ్ నోటీసు ఇచ్చారు. ఈ విషయమై వన్‌టౌన్ సీఐ రామకృష్ణారెడ్డిని వివరణ కోరగా తనకు మెజిస్ట్రేట్ షోకాజ్ నోటీసు జారీ చేసిన విషయం వాస్తవమేనని చెప్పారు.

అంధ ఉపాధ్యాయుడిపై ఆటో డ్రైవర్ దాడి

కడప అర్బన్ : కడప నగరం తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు రోజుల క్రితం పోరుమామిళ్ల నుంచి కడపకు వచ్చిన ఓ అంధ ఉపాధ్యాయుడిపై ఆటో డ్రైవర్ దాడి చేశాడు. తాను అటుగా వెళుతున్నానని పాతబస్టాండ్ నుంచి అతన్ని ఆటోలో ఎక్కించుకుని నిర్మానుష్య ప్రదేశానికి తీసుకుని వెళ్లాడు. అతని వద్ద ఉన్న బంగారు ఉంగరం, చైనుతో పాటు, రూ. 5వేలు నగదును దోచుకుని వెళ్లినట్లు సమాచారం. బాధితుడు ఎట్టకేలకు స్థానికుల సహాయంతో ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని తన గ్రామానికి వెళ్లిపోయాడు. ఈ సంఘటనపై పోలీసులు విచారిస్తున్నట్లు కడప తాలూకా పోలీసులు తెలిపారు. బాధితుడు వచ్చి ఫిర్యాదు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఫొటోగ్రాఫర్ మృతి



మృతి చెందిన చంటిబాబు

మైదుకూరు : మైదుకూరు పట్టణంలోని బద్వేలు రోడ్డులో గల సెయింట్ జాన్స్ స్కూల్ ఎదురుగా గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కంచర్ల చంటిబాబు(28) అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటనపై స్థానికులు తెలిపిన వివరాల మేరకూ.. మండల పరిధిలోని ఎస్.ఎ.రబల్లి గ్రామానికి చెందిన కంచర్ల చంటిబాబు మైదుకూరులో ఫొటోగ్రాఫర్‌గా పని చేస్తున్నాడు. గురువారం యథావిధిగా తన విధులు ముగించుకుని మోటార్ బైక్‌పై గ్రామానికి బయలుదేరాడు. స్థానిక బద్వేలు రోడ్డులో ముందు వెళుతున్న ట్రాక్టర్‌ను దాటుకుని వెళుతుండగా ట్రాక్టర్ తగిలి చంటిబాబు రోడ్డుపై పడిపోయాడు. అదే సమయంలో బద్వేలు వైపు వెళుతున్న లారీ అతనిపై దూసుకెళ్లడంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తిని 108 వాహనంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు. మృతునికి భార్య, ఇద్దరు 3, 4 ఏళ్ల కుమార్తెలు ఉన్నారు.

ఆటో బోల్తాపడి ఇద్దరికి గాయాలు



తీవ్రంగా గాయపడిన వెంకటేష్

చక్రాయపేట : మండలంలోని గండి వీరాంజనేయస్వామి దేవస్థానానికి సమీపంలో గురువారం మధ్యాహ్నం ఆటో బోల్తా పడిన ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయని ఆర్‌కే వ్యాలీ ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. అనంతపురం జిల్లా తలుపుల మండలం వేపపేట నుంచి పెండ్లిమర్రి మండలానికి వస్తున్న ఆటోలో ఎర్రబొమ్మనపల్లి గ్రామం సిద్దారెడ్డిపల్లి బీసీ కాలనీకి చెందిన వెంకటేష్, కుమారకాల్వ గ్రామానికి చెందిన వెంకట సుబ్బమ్మలు వేంపల్లెకు వెళ్లడానికి ఆటో ఎక్కారు. ఆటో గండిక్షేత్రం సమీపంలోకి రాగానే వేంపల్లె వైపు నుంచి ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఆటో బోల్తా పడింది. దీంతో ఆటోలో వెళుతున్న వెంకటసుబ్బమ్మ, వెంకటేష్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని కడప రిమ్స్‌కు తరలించారు. ఆటోలో ఉన్న డ్రైవర్, అతని భార్య, కూతురికి అలాగే ద్విచక్ర వాహనంలో ఉన్న వారికి స్వల్ప గాయాలయ్యాయి.

అనుమానాస్పద స్థితిలో వృద్ధుడి మృతి



మృతి చెందిన మునిరెడ్డి

కడప అర్బన్ : కడప నగరం రామాంజనేయపురం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల సమీపంలో గురువారం సి.మునిరెడ్డి (73) అనే వృద్ధుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. రిమ్స్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు చెన్నూరుకు చెందిన సి. మునిరెడ్డి ప్రస్తుతం కడప కో–ఆపరేటివ్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. కొంతకాలంగా అనారోగ్యంతో పాటు, ఇతర సమస్యలతో బాధపడుతుండేవాడని తెలిపారు. గురువారం రామాంజనేయపురం చర్చి వద్ద కూర్చుని మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

కోడి పెంట తెచ్చిన తంటా

దాడిలో నలుగురికి గాయాలు





ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నారాయణ, పాతనబోయిన నాగలక్షుమ్మ

జమ్మలమడుగు రూరల్ : కోడి పెంట తమ ఇంటిలో పడుతోందని కోళ్లు పెంచుకుంటున్న వారికి చెప్పడంతో పాత కక్షలు మనసులో పెట్టుకుని కర్రలు, రాళ్లతో దాడి చేసిన సంఘటన జమ్మలమడుగు మండలంలోని పొన్నతోట గ్రామంలో జరిగింది. స్థానికుల సమాచారం మేరకు.. పొన్నతోట గ్రామానికి చెందిన పాతనబోయిన నాగలక్షుమ్మ ఇంటిలో ఉన్న చెట్టుపైకి పక్కింట్లో ఉంటున్న రోశమ్మ కుటుంబానికి చెందిన కోళ్లు చేరి పెంట వేస్తున్నాయని నాగలక్షుమ్మ రోశమ్మకు చెప్పింది. దీంతో ఇరు కుటుంబాల మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో పాత కక్షలు మనసులో పెట్టుకుని నాగలక్షుమ్మ భర్త నారాయణ, కుమారుడు నారాయణ, కోడలు గంగాదేవిపై రోశమ్మ కుమారుడు శివకృష్ణ, అతని భార్య, దాయాదులు రాళ్లు, కర్రలతో దాడి చేశారు. ఈ దాడిలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నారాయణను మెరుగైన వైద్యం కోసం ప్రొద్దుటూరుకు తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి సోదరుడు మాజీ ఎంపీపీ పొన్నపురెడ్డి గిరిధర్‌రెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి బాధితులను పరామర్శించారు.

ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీసర్, వలంటీర్‌కు బహుమతులు



బహుమతులను అందుకుంటున్న పీవీ కృష్ణారెడ్డి, నవీన్

మైదుకూరు : ఈ నెల 16 నుంచి 22 వరకు మైసూరులో జరిగిన జాతీయ సమైక్యత శిబిరంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీసర్ పీవీ కృష్ణారెడ్డి, వలంటీర్ నవీన్ ప్రతిభ చూపి బహుమతులు అందుకున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.నారాయణరెడ్డి గురువారం తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మైసూరు యూనివర్సిటీ, కర్ణాటక యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో వివిధ రాష్ట్రాలకు చెందిన ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు, ఆఫీసర్లు జాతీయ సమైక్యత శిబిరంలో పాల్గొన్నారు. శిబిరంలో శ్రమదానం, పరిసరాల పరిశుభ్రత, జాతీయ సమైక్యత–యువత పాత్ర, మాదక ద్రవ్యాలు–దుష్ఫలితాలు, స్త్రీ శక్తి అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. ఇందులో యోగివేమన యూనివర్సిటీ విద్యార్థులు గ్రూప్ డాన్స్, సోలో డాన్స్, పాటల పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచారు. మైదుకూరు డిగ్రీ కాలేజీ ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీసర్ పీవీ కృష్ణారెడ్డి ఉత్తమ ప్రోగ్రాం ఆఫీసర్‌గా, నవీన్ వలంటీర్‌గా బహుమతులు అందుకున్నారు. వీరిని కళాశాల ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ సుభాన్ సాహెబ్, అధ్యాపకులు సుబ్బరాయుడు, రాధారం, రామేశ్వరరెడ్డి, అయ్యవారురెడ్డి, నవనీశ్వర్‌రెడ్డి అభినందించారు.

దెబ్బతిన్న పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు



దెబ్బతిన్న నువ్వుల పంటను పరిశీలిస్తున్న కేవీకే, డాట్ శాస్త్రవేత్తలు

సింహాద్రిపురం : కలుపు నివారణ మందు పిచికారీ చేయడంతో ఎదుగుదలలేని పంటలను కేవీకే, డాట్ శాస్త్రవేత్తలు వీరయ్య, అంకయ్య కుమార్, వి.మాధురి, భగవతి ప్రియలు గురువారం పరిశీలించారు. మండలంలోని రావులకొలను గ్రామంలో మహేశ్వర్ రెడ్డి అనే రైతు తాను కౌలుకు తీసుకున్న 15 ఎకరాల్లో నువ్వుల పంటను సాగు చేశాడు. పులివెందుల గురు బాలాజీ ఫర్టిలైజర్ యజమాని సలహా మేరకు కలుపు నివారణ మందును కొట్టడంతో పంట ఎదుగుదల లేకుండాపోయింది. ఈ నేపథ్యంలో కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి మంగళవారం దెబ్బతిన్న పంటను పరిశీలించారు. ఇలా నాసిరకం కలుపు నివారణ మందుతో ఏ ఒక్క రైతు నష్టపోకుండా చూడాలని అధికారులకు సూచించారు. దీంతో గురువారం శాస్త్రవేత్తల బృందం పంటను పరిశీలించింది. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ముద్దనూరు ఏడీఏ వెంకటసుబ్బయ్య, ఏఏ దీపిక, రైతులు పాల్గొన్నారు.